పత్రికాప్రకటన                                                                కాకినాడ, 7.3.2020

మహిళలు ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో రాణించి, ఉమ్మడి సమస్యలపై సంఘటితంగా పోరాడాలని జిల్లా కలెక్టర్ డి.మురళీధరరెడ్డి కోరారు.

ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించి మహిళా, శిశు సంక్షేమ శాఖ, స్వచ్చంధ సంస్థల ఆధ్వర్యంలో స్థానిక జడ్ పి సమావేశ హాలులో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డి.మురళీధరరెడ్డి ముఖ్య అతిధిగా హాజరై జిల్లా మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు దీప్తిమంతంగా ఉన్నపుడే కుటుంబ, సమాజ ప్రగతి పరుగులు తీస్తుందన్నారు. జీవన గమనంలోని వివిధ దశల్లో సమస్యలను సహనంతో ఎదుర్కొంటున్న మహిళలలో పురుషుల కంటే మానసిక ధృడత్వం అధికమని, ముఖ్యంగా కుటుంబ, ఉద్యోగ బాధ్యతల ఒత్తిడిని సంతులనంతో సమర్థవంతంగా ఎదుర్కొంటున్న మహిళా ఉద్యోగుల ఓర్పు, నేర్పు ప్రశంసనీయమన్నారు. జిల్లాలో వివిధ కీలక ఉద్యోగాలలో మహిళా అధికారులే పనిచేస్తూ, జిల్లాలను అన్నిటా ముందు నిలుపుతున్నారన్నారని, మహిళా సాధికారతా అంశాలన్నిటిలో జిల్లా మహిళలు సత్తా చాటుతున్నారన్నారు. ఏ రంగంలోనైనా తాము బలహీనులమనే భావనను మహిళలు దరిచేరనీయరాదని, ఆత్మవిశ్వాసమే ఆయుధంగా అంబరాన్ని అందుకోవాలని కోరారు. మహిళల రక్షణకు ఎన్ని చట్టాలు వచ్చినా ఇంకా వారి పట్ల దురాగతాలు కొనసాగడం దురదృష్టకమని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ, ఆడవారి పట్ల సభ్యత, గౌరవాలతో వ్యవహరించే సంస్కారాన్ని తల్లులు మగబిడ్డలలో చిన్ననాటి నుండే అలవరచాలని కోరారు. తోటి మహిళల సమస్యల పట్ల ఉదాసీనత, ఉన్నతి పట్ల అసూయ విడనాడి, ఉమ్మడి సమస్యల పరిష్కారానికి, ఆకాంక్షల సాకారానికి సంఘటితంగా ఉద్యమించాలని జిల్లా కలెక్టర్ మురళీధరరెడ్డి కోరారు.

జాయింట్ కలెక్టర్-2 జి.రాజకుమారి, పలువులు జిల్లా అధికారులు మహిళలుగా తాము సాధించిన విజయాలు, అందుకు తమ తమ కుటుంబాల నుండి అందిన సహాయ, ప్రోత్సాహాలను వివరించారు.

కార్యక్రమంలో జడ్ పి సిఈఓ యం.జ్యోతి, బిసి కార్పొరేషన్ ఈడి ఎస్‌విఎస్ సుబ్బలక్ష్మి, ఎస్‌సి కార్పొరేషన్ ఈడి డి.సునీత, డ్వామా పిడి యం.శ్యామల, డియంహెచ్ఓ డా.వి.సత్యసుశీల, లీగల్ మెట్రాలజీ ఏసి ఎంఎస్ఎన్ మాధురి, కెఆర్ సి డిప్యూటీ కలెక్టర్ సుగుణకుమారి, ఆత్మా పిడి సునీత, ఐసిడిఎస్ పిడి సుఖజీవన్ బాబు, సిడిపిఓలు, సూపర్ వైజర్లు, మహిళా ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

(సమాచార శాఖచే జారీ)